క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ సమస్యలను సకాలంలో పరిష్కరించండి



ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రత్యేక స్పందనలో అందిన వినతులను అధికారులు ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ స్పందన హాలులో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక స్పందనలో ఆయన కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావులతో కలిసి పాల్గొన్నారు. వివిధ సమస్యలపై 18 అర్జీలు రాగా వాటిని ఆయా శాఖల అధికారులకు పంపి గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఉద్యోగుల ఇంక్రిమెంట్లు, బదిలీలు, పెన్షన్, జీపీఎఫ్ వంటి సమస్యలపై 8 అర్జీలు అందాయి.

21న నాయకర్ వర్ధంతి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ 109వ వర్ధంతిని ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్నట్టు ఎంఎస్ఎన్ చారిటీస్ చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్, అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఆర్‌వి చందన సంయుక్తంగా తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు ఎంఎస్ఎన్ చారిటీస్ కార్యాలయంలో వాల్ పోస్టర్ విడుదల చేశారు. 20వ తేదీ సాయంత్రం క్రీడా విజేతలకు, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. 21వ తేదీన సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ కె. అమరేశ్వరరావు, రాజశేఖర్, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, గంగాధరరావు, కేసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'పార్షియల్ లంగ్ లోబెక్టమీ'



రాజును పరామర్శిస్తున్న డాక్టర్ లావణ్యకుమారి, డీసీఎస్ ఆర్‌ఎంవో అనిత, వైద్యుల బృందం

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో ఊపిరితిత్తుల టీబీకి గురై ప్రాణాపాయానికి చేరుకున్న ఓ యువకుడికి విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. పార్షియల్ లంగ్ లోబెక్టమీ నిర్వహించి అతడి ప్రాణాలు కాపాడారు. సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపిన వివరాల మేరకు, కాకినాడ పర్లోవపేటకు చెందిన 32 ఏళ్ల ఎస్.రాజు టీబీ సోకి రక్తం కక్కుతూ ప్రాణాపాయ స్థితిలో జీజీహెచ్‌లో చేరాడు. వైద్యులు పరీక్షించి లోబెక్టమీ నిర్వహించాల్సిన అవసరం ఉందని నిర్ధారించారు. శుక్రవారం పార్షియల్ లంగ్ లోబెక్టమీ చేసి రాజు ప్రాణాలు కాపాడారు. ఈ శస్త్రచికిత్సలో కార్డియో థొరాసిక్ వైద్యులు హరివదన్, కిరణ్, మదన్‌తో పాటు హెచ్‌వోడీ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలోని అనస్థీషియా బృందం పాల్గొన్నాయి.

ఆవులను తరలిస్తున్న కంటైనర్ సీజ్

పిఠాపురం: ఆవులను అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న కంటైనర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు గొల్లప్రోలు ఎస్సై బాలాజీ తెలిపారు. గొల్లప్రోలు మండలం వన్నెపూడి జంక్షన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించి విజయనగరం నుంచి చెన్నైకు వెళ్లే కంటైనర్‌ను ఆపి తనిఖీ చేయగా అక్రమంగా ఆవులను తరలిస్తున్నట్లు గుర్తించి 40 ఆవులను స్వాధీనం చేసుకున్నారు.



తిరుమల తిరుపతి ఆలయాన్ని తలపించేలా ఆకట్టుకున్న కల్యాణ వేదిక సెట్టింగ్



కల్యాణాన్ని తిలకిస్తున్న రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ ద్వారంపూడి భాస్కరరెడ్డి దంపతులు



వేంకటేశ్వరుని వేషధారణలో ఓ భక్తుడు..

నభూతో నభవిష్యతి..

- తిరుమలను తలపించిన కాకినాడ
- వైభవంగా పద్మావతీ శ్రీనివాసుల కల్యాణం
- పర్యవేక్షించిన ఎమ్మెల్యే ద్వారంపూడి దంపతులు



కల్యాణాన్ని తిలకిస్తున్న ఎంపీ వంగా గీత

కాకినాడ: పద్మావతి శ్రీనివాసుల కల్యాణ మహోత్సవంతో శుక్రవారం సాయంత్రం కాకినాడ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నభూతో నభవిష్యత్ అనేలా దాదాపు 40 వేల మంది భక్తుల రాకతో ఆర్‌ఎంసీ క్రీడా ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. లోక కల్యాణార్థం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతుల పర్యవేక్షణలో ఈ నెల 14న స్థానిక సాంబమూర్తినగర్‌లో రూ.4 కోట్ల వ్యయంతో పూర్తి రాతి కట్టుతో వైభవ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠను వేడుకను పూర్తి చేశారు. ఆ తరువాత సాంప్రదాయబద్ధంగా 15న పసుపు దంచడం వంటి అన్ని ప్రక్రియలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం సుమారు 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సాగిన కల్యాణోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించారు. భారీగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షణలో ఆయన సోదరుడు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, పార్టీ నేతలు సుంకర విద్యాసాగర్, రాగిరెడ్డి కన్న, మల్లిపాముల గణపతి వంటి ఇతర ముఖ్య నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన వలంటీర్లు హాజరైన భక్తులకు సేవలందించారు.



కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు అభివాదం చేస్తున్న ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు



అన్నమయ్య కీర్తనలను ఆలపిస్తున్న కళాకారులు



కల్యాణం తిలకిస్తున్న మంత్రి వేణు దంపతులు



శేషశైలవాసుని కల్యాణానికి తరలి వచ్చిన అశేష జనవాహిని

నగర వైఎస్సార్ సీపీ పగ్గాలు మళ్లీ ప్రసన్నకే



సుంకర శివప్రసన్న

కాకినాడ: నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలిగా సుంకర శివప్రసన్న నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అధిష్టానం శుక్రవారం ఈ మేరకు పార్టీ సిటీ కార్యవర్గాన్ని నియమించారు. ఉపాధ్యక్షులుగా చెక్కా చక్రవర్తి, రాజవరపు కృష్ణ, మండబోయిన నేరెళ్ల, జనరల్ సెక్రటరీలుగా కోకా గిరి, రాజాన మంగారత్నం, మహ్మద్ ఖాజా మొహిద్దీన్, సెక్రటరీలుగా యార్లగడ్డ శ్రీరామ, సిద్దాంపు రాజు, మన్యం డివి ప్రసాద్‌బాబు, రఫీఖాన్, డొంకా గోకుల్, నూకపెయ్యి దైవకృప, పెన్మత్స వెంకట్, సురిమల్ల విజయ్, ట్రెజరర్‌గా ఎడ్లపల్లి వీరవెంకట, జాయింట్ సెక్రటరీలుగా ముల్లే నాగిరెడ్డి, లావేటి అప్పారావు, గుట్ల రామకృష్ణ, మాదేపల్లి మీరమ్మ, గింజాల నాగేశ్వరరావు, పాలిక శివ, కార్యనిర్వాహక సభ్యులుగా కె.గాంధీమోహన్, ఉద్దండం, మన్యాల లక్ష్మీనారాయణ, శెట్టి వీరవెంకట, పుట్టిపు హేమంత్‌కుమార్, ఎల్లా వెంకటేశ్వరరావు, గొరుసు దివాకరరెడ్డిలను నియమించారు.

ఫుడ్ టెక్నాలజీ విభాగంలో జనరేటర్ ప్రారంభం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఫుడ్ టెక్నాలజీ విభాగంలో రూ.16 లక్షలతో ఏర్పాటు చేసిన 160 కేవీ జనరేటర్‌ను శుక్రవారం వీసీ ప్రసాదరాజు ప్రారంభించారు. వర్సిటీ ఆవరణలో ఉన్న ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు నిరంతరరం విద్యుత్ సరఫరా ఉండేందుకు వీలు కలుగుతుందని, నమూనా పరీక్షలు, విద్యార్థుల ప్రాక్టికల్స్‌కు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి మాలోతు రమేష్, రిజిస్ట్రార్ సుమలత, ఏఈ భాస్కరరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ పక్క భవనంలో అగ్ని ప్రమాదం

కాకినాడ సిటీ: కాకినాడ కలెక్టరేట్ పక్కన ఉన్న ట్రావెల్స్ బంగ్లాలో ఉన్న చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. మంటలు ఎగసి పడి విద్యుత్ శాఖకు సంబంధించిన పలు వస్తువులు దగ్ధం అయ్యాయి. అగ్నిప్రమాదం విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

సప్తాశ్వరథునికి ప్రణామం

- ఘనంగా రథసప్తమి వేడుకలు
- సూర్యభగవానుడికి అభిషేకాలు
- దర్శనాల కోసం క్యూ కట్టిన ప్రజలు

బోట్‌క్లబ్: రథ సప్తమి సందర్భంగా నగరంలో సూర్యనారాయణమూర్తి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని సర్వాంగసుందరంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకాలు చేశారు. భానుగుడి సమీపంలో భానులింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సూర్యనారాయణ మూర్తి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి దర్శనం కోసం సుమారు రెండు గంటలకు పైగా భక్తులు క్యూలో నిరీక్షించాల్సి వచ్చింది. బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణ మూర్తికి ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక సంతచెరువు మార్కెట్ సమీపంలో ఉన్న సూర్యనారాయణమూర్తి ఆలయంలోను భక్తులు స్వామికి అభిషేకాలు నిర్వహించారు.





భానుగుడి సూర్యనారాయణమూర్తి ఆలయంలో స్వామివారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణ మూర్తి ఆలయంలో ఆలయ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక దేవాలయంవీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీటితో పాటు నగరంలో పలు ఆలయాల ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణ మూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

కరప మండలంలో..

కరప: మండలంలో గ్రామ, గ్రామాన శుక్రవారం రథసప్తమి సందర్భంగా సూర్యభగవానునికి పూజలు నిర్వహించారు. చిక్కుడు కాయలతో రథం చేసి, దానిపై సూర్యభగవానుడిని ఉంచి, చిక్కుడు పూలతో అర్చనచేశారు. ఆవు పిడకలపై ఆవుపాలను పొంగించి, క్షీరాన్నం వండి చిక్కుడు, జిల్లేడు ఆకులలో ఉంచి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

సాధారణ ఎన్నికలకు సన్నద్ధం

- కలెక్టర్ కృతికా శుక్లా
- సీఈఓ ముఖేష్‌కుమార్‌తో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: రానున్న సాధారణ ఎన్నికలను ప్రణాళిక ప్రకారం నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టనున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం విజయవాడ నుంచి 2024 సాధారణ ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్, ఎస్పీలు, డీఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, ఇతర ఎన్నికల అధికారులతో పాల్గొని మాట్లాడుతూ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం కృషి చేస్తున్నామన్నారు. ఇందుకోసం జిల్లాలో తీసుకుంటున్న చర్యలను సీఈవోకు కలెక్టర్ కృతికా శుక్లా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఓటరు జాబితాలోని అంశాలపై నమోదైన ఫారం 6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బంది శిక్షణ కార్యక్రమాలు, జిల్లా సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు, పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు తదితర అంశాలను వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్, సీపీవో పి.త్రినాథ్ ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు నీరు అందాలి

- జేసీ ప్రవీణ్ ఆదిత్య



సాగు వివరాల బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య, చైర్మన్ జీవీ వీరమోహన్‌రావు

కాకినాడ సిటీ: శివారు ఆయకట్టు రైతులకు నీటి ఎద్దడి లేకుండా సమన్వయంతో పని చేయాలని, ప్రతీ ఎకరాకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వివేకానంద మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ జీవీ వీరమోహన్‌రావు అధ్యక్షతన జరిగింది. అధికారులు ఒక ప్రణాళికతో ఫీల్డ్ అసిస్టెంట్ సేవలను ఉపయోగించుకొని సమస్యలు పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. అధికారులు మాట్లాడుతూ జిల్లాలో రబీ 2023–24లో 65,472 హెక్టార్లల్లో వరి సాగు చేసినట్లు తెలిపారు. దీనిలో 60 శాతం వరి సాగుకాగా, మిగిలినవి ఇతర పంటలని తెలిపారు. సాగునీటి సమస్యల చర్చలో కాలువల్లో పూడిక, గుర్రపు డెక్క తీయాలని రైతులు కోరారు. రబీ వరికి నీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ అంశాలపై జేసీ సానుకూలంగా స్పందించారు. పెద్దాపురం ఏరువాక కేంద్ర సైంటిస్ట్ రబీలో ఆశించే తెగుళ్లు, వాటి నివారణ పద్ధతులను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా సాగు వివరాల బుక్‌లెట్‌ను జేసీ తదితరులు ఆవిష్కరించారు.

సేవలతోనే వలంటీర్లకు గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ సత్యనారాయణ

కాకినాడ రూరల్: సేవలతోనే వలంటీర్లకు మంచి గుర్తింపు వచ్చిందని, బాధ్యతగా చేయాలని, అండగా ఉంటామని నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేట వైద్యనగర్‌లో ఎమ్మెల్యే కన్నబాబు క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం మండల పరిధిలోని గంగనాపల్లి, కొవ్వాడ, రేపూరు గ్రామాల వలంటీర్లతో, మధ్యాహ్నం చీడిగ, కొవ్వూరు గ్రామాల వలంటీర్లతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు అధ్యక్షతన జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, పార్టీ నేత గోపుశెట్టి బాబ్జీ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్, వైఎస్సార్ సీపీ మండల సచివాలయాల కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ వాసంశెట్టి సత్యవేణి, వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ విభాగం జిల్లా కన్వీనర్ తోటకూర శ్రీను, కొవ్వాడ సర్పంచ్ కోటిపల్లి ఉమా, పార్టీ ప్రచార విభాగం నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సీఎం జగన్ గొప్ప ఆశయంతో పేదలకు నేరుగా సేవలందించాలనే ఉద్దేశంతో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు తీసుకువచ్చారని, వలంటీర్లు ఉద్యోగులు కారని, అయినప్పటికీ ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు వలంటీర్ వ్యవస్థపై ఆరోపణలు చేశారన్నారు. సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబు మీ సేవలను గుర్తించారని, భవిష్యత్తులో ఇంకా మంచి జరుగుతుందని, విధేయత చూపి పనిచేయాలని కోరారు.

మోదీ విధానాల వల్లే రైతు ఆత్మహత్యలు



గ్రామీణ బంద్ సందర్భంగా సీపోర్టు వద్ద ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కాకినాడ సిటీ: సంయుక్త కిసాన్ మోర్చాలోని 550 రైతు సంఘాలు, 11 కేంద్ర కార్మిక సంఘాలు, ట్రాన్స్‌పోర్టు యాజమాన్య, డ్రైవర్ల సంఘాలు ఇచ్చిన గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మె, ట్రాన్స్‌పోర్టు దేశవ్యాప్త పిలుపు మేరకు కాకినాడ కేఎస్‌పీఎల్ పోర్టులో తెల్లవారుజాము 5 గంటల నుంచి కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వంలో బంద్ నిర్వహించాయి. మోడీ హయాంలో 12 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలు మాఫీ జరిగి ప్రపంచ కుబేరుల్లో చేరుతుంటే గిట్టుబాటు ధర లభించని రైతులు రుణాలు చెల్లించలేక 1.6 లక్షల మంది ఆత్మహత్యలకు పాల్పడడానికి మోడీ విధానాలే కారణమని ఆందోళనకారులు విమర్శించారు. రైతాంగం పోరాట సందర్భంగా కనీస మద్దతు ధరను చట్టం చేస్తానని హామీ ఇచ్చిన మోడీ మాట తప్పారన్నారు. కేంద్ర కార్మిక సంఘాల నాయకులు జి బేబీరాణి, చెక్కల రాజ్‌కుమార్, తోకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరప పోస్టాఫీస్ వద్ద..

కరప: స్థానిక పోస్టాఫీసు వద్ద కార్మిక, రైతు సంఘాల, ప్రజాసంఘాల ప్రతినిధులు సీహెచ్ రమణి, వాసంశెట్టి అప్పారావు, ఎం.ముసలయ్య, ఎస్.గణపతిరావు, తిరుపతిరావు తదితరులు ధర్నా చేశారు. ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలని, ప్రతి కౌలురైతుకు గుర్తింపు కార్డు ఇవ్వాలని నినాదాలు చేశారు.

లారీలను నిలిపివేసి నిరసన

కాకినాడ రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ అచ్చంపేట జంక్షన్ వద్ద జయహో రథసారధి డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీలు నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వాసు యేలేటి మాట్లాడుతూ అఖిల భారత సమ్మెకు తమ అసోసియేషన్ తరపున మద్దతు తెలియజేస్తున్నామని, ఆ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశామన్నారు. ఎస్సై రవీంద్రబాబు, సిబ్బంది అక్కడకు చేరుకుని ఆందోళనను విరమింపజేశారు. అలాగే జాతీయ కార్మిక సంఘాల గ్రామీణ బంద్‌కు మద్దతుగా కాకినాడ సీపోర్టు బయట, పలు పరిశ్రమలు వద్ద కార్మిక సంఘాలు సంఘీభావం తెలిపాయి.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

- ఆ దిశగా క్యాడర్ పని చేయాలి
- పార్టీ కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్

పిఠాపురం: ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలని కోరుకుంటున్నారని, ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి సునీల్ అన్నారు. స్థానిక మున్సిపల్ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని విస్తృతంగా అభివృద్ధి కూడా చేశారని చెప్పారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా 4 పోర్టులు, 10 హార్బర్లతో పాటు వైద్య కళాశాలలు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని వివరించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులు తీసుకుని రావడంలో సీఎం జగన్ సత్ఫలితాలు సాధించారన్నారు. వీటితో పాటు ఇంకా అనేక రంగాల్లో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుని వెళ్లడం ద్వారా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించుకుని, వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసి రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి పథంలో నడిపించాలని సునీల్ పిలుపునిచ్చారు. టీడీపీ – జనసేన పొత్తు వల్ల వైఎస్సార్ సీపీకి, తనకు ఎటువంటి ఇబ్బందీ ఉండదని చెప్పారు.

కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీత మాట్లాడుతూ, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన సాగిస్తున్నారని అన్నారు. అందుకే మళ్లీ ఆయనే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, దీనికి వైఎస్సార్ సీపీ క్యాడర్ అంతా కలసికట్టుగా పని చేయాలని కోరారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి తమకు అందరూ సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లలో దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పాలన అందించి, ప్రజల మన్ననలు పొందిన ముఖ్యమంత్రి జగన్ ఒక్కరేనని అన్నారు. ప్రజలు మళ్లీ ఆయననే కోరుకుంటున్నారని చెప్పారు. తనకు సహకరించినట్టుగానే వంగా గీతకు, సునీల్‌కు సహకరించి, పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకుని రావడానికి అందరూ కృషి చేయాలని కోరారు. నియోజకవర్గవ్యాప్తంగా భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు సునీల్‌కు, వంగా గీతకు ఘన స్వాగతం పలికారు.

హెచ్‌ఐవీపై అవగాహన కోసం వీధినాటకాలు



వీధినాటకాల ద్వారా అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

కాకినాడ క్రైం: హెచ్‌ఐవీపై అవగాహన పెంపొందించి నియంత్రణే లక్ష్యంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర ఆరోగ్య విభాగం ఆదేశాల మేరకు కళాజాతలకు రూపకల్పన చేసింది. అందులో భాగంగా వీధి నాటకాలు ప్రదర్శించడం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సిద్ధమైంది. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం కాకినాడలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ప్రారంభించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ రమేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలో ఈ నెల 16వ తేదీన ప్రారంభమైన కళాజాత వీధినాటకాల కార్యక్రమం 27వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. డీఐవో డాక్టర్ రత్నకుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిలింగం, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.